

■ ఆరి సీతారామయ్య

పది గంటలప్పుడు ఫోన్ మోగింది.

"హల్లో."

"హల్లో, నేను డిటెక్టివ్ స్పెర్లింగ్‌ని. డెట్రాయట్ ఈస్ట్ ప్రిసింక్ట్ నుంచి మాట్లాడుతున్నాను. మిస్టర్ వెంకట్రావు ఉన్నారా?"

"నేనే వెంకట్రావుని. మీకేంగావాలి?" పోలీసువాడు నన్నెందుకు పిలుస్తున్నాడా అని కొంచెం కంగారు పడుతూ అడిగాను.

"ఇక్కడ స్టేషన్‌కు ఒకామెను తీసుకొచ్చారు. ఆమెకు సరిగ్గా ఇంగ్లీషు రాదు. ఇండియా మనిషి. తెలుగు మాట్లాడుతుందట. మాకు ఆమె మాటలు అనువాదం చేసిపెట్టే మనిషి కావాలి. మీరు తెలుగు మాట్లాడతారని తెలిసింది. మీ సహాయం అడుగుదామని పిలుస్తున్నాను."

నా పేరూ, ఫోన్ నంబరూ నీకెక్కడ దొరికాయని అడుగుదామనిపించిందిగాని అడగలా.

"ఎప్పుడు రావాలి" అని అడిగితే, "ఎంత తొందరగా రాగలిగితే అంత మంచి"దన్నాడు. "సరే, వస్తా"నన్నాను. స్టేషన్‌కు రావడానికి డైరెక్షన్లు అడిగి రాసుకొని ఫోన్ పెట్టేశాను.

స్నానం అదీ ముగించి తయారై స్టేషన్‌కు చేరేసరికి ఒంటి గంటైంది. సహాయం చెయ్యడాని కొచ్చినందుకు థాంక్స్ చెప్పాడు స్పెర్లింగ్. స్టేషన్ లోపలికి తీసుకెళ్ళి నన్నక్కడ కూర్చోబెట్టి, ఆమెను తీసుకొస్తానని వెళ్ళాడు.

అయిదు నిమిషాల తరువాత ఆ తెలుగామెతో సహా వచ్చాడు. అలాంటి మనిషిని నేనెప్పుడూ చూళ్ళేదు. ఒక చిన్న సైజు రాక్షసిలా ఉంది. తల వెంట్రుకలు చిందరవందరగా ఉన్నై. ముఖం వాచి ఉంది. ఎర్రబడ్డ కళ్ళు, నన్ను చూడగానే తల వంచుకొని పెద్దగా ఏడవడం మొదలుపెట్టింది.

"వీళ్ళింట్లో ఏదో గొడవ జరుగుతుంటే పక్కింటి వాళ్ళు ఫోన్ చేశారు ఈ ఉదయం. ఇద్దరు పోలీసులు వీళ్ళింటికి వెళ్ళారు. వాళ్ళెళ్ళేసరికే ఈమె భర్తను కత్తితో పొడిచి చంపేసింది. అతన్ని పోస్టుమార్టం కోసం హాస్పిటల్‌కి తీసుకెళ్ళి, ఈమెను ఇక్కడికి తీసుకొచ్చారు" అని జరిగిన విషయం క్లుప్తంగా చెప్పాడు స్పెర్లింగ్.

మళ్ళా సంభాషణ మొదలుపెడుతూ, "అసలేం జరిగిందో తెలుసుకోవాలి. కానీ, ఆ విషయాలు అడిగే ముందు ఈమెకు ఉన్న హక్కుల గురించి చెప్పాలి. ఒక హత్య చేసిందనే నేరం మీద మేము ఈమెమీద కేసు పెడుతున్నాము. ఈమె మాకు చెప్పే వివరాలు ఈ కేసులో మేము వాడుకోవచ్చు. మాకేమీ చెప్ప దల్చుకోకపోతే అది ఆమె ఇష్టం. ఆమెకు ఆర్థిక స్తోమత ఉంటే ఎవర్నయినా లాయర్ని పెట్టుకోవచ్చు. లేకపోతే ప్రభుత్వమే ఒక లాయర్నిస్తుంది. ఈ విషయాలు ముందామెకు చెప్పండి" అన్నాడు స్పెర్లింగ్.

ఆమెతో ఎలా మాట్లాడడం మొదలుపెట్టాలో అర్థంగాలా నాకు. "మీ పేరూ" అన్నాను.

మళ్ళా పెద్దగా ఏడవడం మొదలు పెట్టింది. భర్త శవం దగ్గర కూర్చొని ఏడుస్తూ బంధువులెవరన్నా కనపడగానే ఇంకా పెద్దగా ఏడ్చే ఆడవాళ్ళు జ్ఞాపకం వచ్చారు. ఈ ఊరు గాని ఊళ్ళో ఇంకొక తెలుగువాడు బంధువులాగా కనపడతాడు కాబోలు. కొంచెం తేరుకొన్న తరువాత తల వంచుకొనే "శారద" అంది. ఇన్‌స్పెక్టర్ చెప్పిన విషయాలు ఆమెకు చెప్పాను. ఆమె ఏమీ జవాబు చెప్పలేదు. లాయర్ దొరికిందాకా పోలీసులకేమీ చెప్పకుండా ఉండడమే ఆమెకు మంచిదని నాకు తెలిసినా, ఆమెకా విషయం చెప్పాలో, చెప్పకూడదో నాకర్థం కాలా. "డిటెక్టివ్ మిమ్మల్ని కొన్ని ప్రశ్నలడగాలట, జవాబు చెప్తారా" అని అడిగాను. తలూపిందామె ఏడుస్తూనే.

ఏడుస్తూ ఏడుస్తూ చెప్పిన వివరాలివి: ఉదయం లేచి, తాను తయారై, వంటగదిలోకెళ్ళి సాంబారు చేసి, దోసెలు పోసిందట ఆమె. అతను నిద్రలేచి తయారై వంటగదిలో ఉన్న చిన్న బ్రేక్ ఫాస్ట్ టేబుల్ దగ్గర కూర్చొన్నాడట. రెండు దోసెలు ప్లేటులో పెట్టి, చిన్న గిన్నెలో సాంబారు పోసి, రెండూ అతని ముందు టేబుల్ మీద పెట్టి, మంచినీళ్ళు తెచ్చి పెట్టిందట ఆమె. అతను తింటుండగా ఆమె కాఫీ మెషీన్‌లో కాఫీ పొడి వేసి నీళ్ళు పోసింది. ఇంకొక దోసె పోస్తుండగా, "అల్లం పచ్చడి తీసుకురా" అన్నాడు. భయపడుతూ, "అల్లం పచ్చడి లేదండీ, రేపు చేస్తాను" అందిట ఆమె. "రేపటిదాకా ఇక్కడే కూర్చోమంటావా" అని మంచినీళ్ళ గ్లాసు ఆమె వైపు విసిరాడట. అదొచ్చి తలకు తగలడం, తన ముందున్న కూరగాయల కత్తి తీసుకొని వెళ్ళి అతని మీదపడి అర్థం లేని ఆవేశంలో పొడవడం క్షణంలో జరిగిపోయాయట.

అదంతా గుర్తుకొచ్చి మళ్ళా పెద్దగా ఏడవడం మొదలుపెడుతుందేమోననుకున్నా. కానీ, మొదటి సారిగా తలెత్తి నా వైపు చూసింది. చూస్తుంది నావైపేనయినా నన్ను కాదు. ఎక్కడో నా వెనుక చాలా దూరాన ఉన్న దృశ్యాన్ని చూస్తున్నట్లు కనిపించింది. ఆమెకు ఇరవై అయిదు సంవత్సరా లుండవచ్చు. అయినా, అల్లం పచ్చడి కోసం కొట్టు కోవడమేమిటి? మనిషిని చంపడమేమిటి? వీళ్ళేం తెలుగువాళ్ళు? అనుకున్నాను.

స్పెర్లింగ్‌కు ఇంకా కొన్ని వివరాలు కావాలి. "ఇంతకుముందెప్పుడన్నా వీళ్ళు తగవులాడుకున్నారా?" అని అడగమన్నాడు. అడిగాను. ఆమె మళ్ళీ తల వంచుకుంది. సన్నగా ఏడుస్తుంది. కొంచెం సేపైం తరువాత తగువులాట రోజూ జరిగేదేనని, జుట్టు పట్టుకొని లాగడం, ఈడవడం, గోడకేసి కొట్టడం ఇవన్నీ మామూలేనని చెప్పింది. పెళ్ళయి రెండున్నరేళ్ళయిందట. అమెరికా వచ్చింతరువాత మొదటి కొన్ని రోజులు బాగానే ఉన్నాడట. తరువాత మొదలైందిట హింస.



చిత్రాలు: నర్సిం

అలాంటి మనిషిని నేనెప్పుడూ ... వాచి ఉంది. ఎర్రబడ్డ కళ్ళు, నన్ను

అప్పటికే దాదాపు రెండయింది. స్పెర్లింగ్‌కు తనకు కావాల్సిన సమాచారమంతా దొరికినట్లుంది. ఆమెను తన గదికి తీసుకెళ్ళి వదిలేసొచ్చి, నా సహాయానికి కృతజ్ఞతలు చెప్పాడు. "సరే"నని నేను బయలుదేరుతుండగా, "క్షమించాలి, ఈమె ఏం తింటుందో తెలియదు. ఉదయం నుంచి మంచినీళ్ళు కూడా తాగలేదు! మీకు తెలుసా ఏం తింటుందో" అనడిగాడు. అప్పుడనిపించింది. పాపం శాకాహార మేమోనని. అలా అనుకుంటుండగానే మళ్ళీ – 'హత్య చేసిన మనిషి మీద జాలి పడడమేంటి' అనిపించింది. "ఏమో, నాకు తెలియదు" అన్నాను.

ఇంటికెళ్ళి ఈ కథంతా శ్రీమతితో చెప్తే, "పాపం మనలాగే వెజిటేరియనేమో. జైల్లో ఏమి తిండి పెడతారో ఏమో? మనల్ని అన్నం, కూర తీసుకెళ్ళి ఇవ్వనిస్తారేమో కనుక్కోండి" అంది. ఏమో అడుగుదామని ఫోన్ చేస్తే, వాళ్ళకేం అభ్యంతరం లేదన్నాడు స్పెర్లింగ్. మరుసటి రోజు భోజనం ఇచ్చి ఆమెను



...చూశ్కేదు. తల వెంట్రుకలు చిందరవందరగా ఉన్నై. ముఖం

చూడగానే తల వంచుకొని పెద్దగా ఏడవడం మొదలు పెట్టింది.

చూసొచ్చాం. మళ్ళీ చాలా ఏడ్చింది. భోజనం తెచ్చి పెట్టినందుకు చేతులెత్తి నమస్కారం చేసింది తల వంచుకొనే. ఆమె శాకాహారనీ, ఏం తింటుందో, ఏం తినదో వివరంగా చెప్పాం స్పెర్లింగ్‌కు. అతను మంచి వాడు లాగుంది. అన్నీ వివరంగా పుస్తకంలో రాసుకున్నాడు.

రెండు రోజుల తరువాత శారదను చూడ్డానికి మళ్ళా పోలీస్ స్టేషన్‌కెళ్ళాను. కొంచెం తేరుకున్నట్లుంది. అయినా, నన్ను చూడగానే ఏడవడం మొదలు పెట్టింది. ఏం చెప్పాలో తెలియక అలాగే కొంచెం సేపు ఎదురుగా కూర్చున్నాను. నాలుగైదు నిమిషాల తరువాత తానే మాట్లాడడం మొదలు పెట్టింది.

“ఈ మధ్యే మా అమ్మ పోయింది. నాన్న ఒక్కడే ఉన్నాడు. ఉత్తరం రాసి నా బతుకు గురించి ఎలా చెప్పాలో తెలియడం లేదు. నా మీద దయ ఉంచి మా నాన్నకు ఉత్తరం రాసి పెట్టండి” అని ఈసారి జోరున చాలా పెద్దగా ఏడవడం మొదలుపెట్టింది.

కొంచెం సేపు అలాగే వింటూ కూర్చున్నానేగాని, ఏమ్మాట్లాడాలో, ఎలా ఓదార్చాలో నాకంతుబట్టలేదు. చివరికి, “మీ నాన్నగారికి నేను రాస్తాన్లెండి” అన్నాను.

ఆయన పేరూ, అడ్రసూ చెప్పింది. పెద్దగుంట శేషగిరిరావు గారిది నెల్లూరు దగ్గర ఒక చిన్న ఊరు–పెద్దగుంట. ఆయనకు శారద తప్ప ఇతర సంతానం లేరు. ఆ ఊళ్ళో చిన్న రైతు శేషగిరిరావు గారు. మరుసటి రోజే ఉత్తరం రాస్తానని చెప్పి ఇంటికొచ్చాను.

మరుసటి వారం శారదను పోలీస్ స్టేషన్ నుంచి డెట్రాయట్‌లో కౌంటీ జైలుకు మార్చారు. మొదటి సారిగా జడ్జి ముందు జరిగిన విచారణలో ప్రభుత్వం ఇచ్చిన లాయర్ శారద తప్పు చేయలేదనీ, తన ప్రాణం కాపాడుకోవడానికే ఆమె భర్త మీద తిరగబడిందనీ వాదించాడు.

పబ్లిక్ ప్రాసిక్యూటర్ మాత్రం, “ఈ అమ్మాయి హత్య చేసింది. భర్త ఈమెను కొట్టినట్టు ఏమీ ఆధారాలు లేవు. కేసు మీద విచారణ జరుగుతున్నంత కాలం ఈమె జైల్లోనే ఉండడం మంచిది” అన్నాడు. జడ్జి ఒప్పుకున్నాడు.

జైలుకెళ్ళి ఆమెను చూడడం నాకు వారం రోజుల దాకా వీలుగాలేదు. మరుసటి ఆదివారం చూడ్డాని కెళ్ళినప్పుడు కొంచెం తగ్గిపోయినట్లు కనిపించింది. కానీ, కళ్ళలో అంతకు ముందున్న దైన్యం లేదు. ముఖంలో విచారం కూడా లేదు. తన పరిస్థితి అర్థం అయిందో, లేదో అనుకున్నాను. “జైలు ఆహారం ఎలా ఉంది” అని అడిగితే, ఫరవాలేదనీ, జైలు అధికారులు తనను దయగా, శ్రద్ధగానే చూసుకుంటున్నారనీ అంది.

తన కేసు గురించి నా అభిప్రాయం అడిగింది. చెప్పడం కష్టం అన్నాను. ఇంకా కొన్నాళ్ళలో కేసు విచారణ మొదలవుతుంది. పన్నెండు మంది జ్యూరీగా ఎన్నుకోబడతారు. మీరు ఆత్మరక్షణ ప్రయత్నంలో భర్తను చంపారని మీ లాయర్ వాళ్ళను నమ్మించగలిగితే నాలుగైదేళ్ళలో మీరు జైలు నుంచి బయటపడతారు. కానీ, బాగా ఆలోచించే, చంపెయ్యాలనే ఉద్దేశంతోనే కత్తితో పొడిచారని అనుకుంటే మాత్రం జ్యూరీ మీకు యావజ్జీవం జైల్లో ఉండేటట్లు శిక్ష వెయ్యొచ్చు” అని చెప్పాను.

ఆమె ముఖంలో ఎలాంటి భావోద్రేకం కనిపించ లేదు. మూడేళ్ళయినా, ముప్పై ఏళ్ళయినా ఒకటేనా? ఆమె జీవితం గురించి అడగాలనీ, తెలుసుకోవాలనీ ఉందిగానీ అడిగితే బాగుండదేమోనని ఊరుకున్నాను.

“ఈ పోయిన రెండేళ్ళ నరకం తరువాత, గడిచిన రెండు వారాలు ఎంత నిర్మలంగా, శాంతంగా గడిచాయో” అంది అకస్మాత్తుగా.

ఇదేం మనిషి. జైలు శాంతంగా ఉంటుందా? బహుశా అతను నిజంగా రాక్షసుడేనేమో? లేకపోతే అతను పోయిన తరువాత జైలే నయం అనుకుంటుందా?

“అతను మిమ్మల్ని చాలా హింసలు పెట్టాడా” అన్నాను మరేం అడగాలో తెలియక.

“పెళ్ళయింతరువాత దాదాపు నెల రోజులు బాగానే చూసుకున్నారు” అంటూ మొదలుపెట్టి ఆమె చెప్పిన కథ ఇదీ.

శారద తల్లితండ్రులకు ఒక్కతే కూతురు. అన్నదమ్ములు లేరు. మాధవరావు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. పెళ్ళి చేసుకుందామని అమెరికా నుంచి ఇండియా వెళ్ళి, శారదను చూసి వారం రోజుల్లో పెళ్ళి చేయించుకొని, పెళ్ళి జరిగింతరువాత మూడో రోజే తిరిగి డెట్రాయట్ వచ్చాడు. తరువాత కొద్ది రోజుల్లోనే శారదకు వీసా వచ్చింది. మద్రాస్ నుంచి బయల్దేరి సింగపూర్ మీదగా అమెరికా వచ్చింది శారద. వచ్చినప్పట్నించీ ఇక్కడే డెట్రాయట్‌లో ఒక ఎపార్ట్‌మెంట్లో ఉంటున్నారు.

మాధవరావు బాగా కష్టపడి పనిచేసేవాడు. పొద్దుటే ఎనిమిది గంటలకు పనికెళ్ళి రాత్రి ఏడు ఎనిమిది గంటలకొచ్చేవాడు. అతనిది విజయవాడ దగ్గర చిన్న ఊరు. తనకంటే చిన్న వయసు తోబుట్టువులున్నారు. వాళ్ళకు పెళ్ళిళ్ళు చేయించే బాధ్యత అతని మీద ఉండడం వల్ల డబ్బు ఖర్చు పెట్టే విషయంలో చాలా జాగ్రత్తగా ఉండేవాడు. అప్పుడప్పుడూ ఊరికి డబ్బు పంపించేవాడు.

శనివారాలూ, ఆదివారాలు కూడా కనీసం సగం రోజైనా పనికెళ్తుండేవాడు మాధవరావు. అందువల్ల వాళ్ళకు బయటి ప్రపంచంతో పెద్దగా సంబంధం ఉండేది కాదు. ఎపార్ట్‌మెంట్ వదలి బైటికెళ్ళడం కూరగాయలు, వస్తువులూ తెచ్చుకోవడానికెళ్ళినప్పుడే. ఆమెకు అర్థం అయినా కాకపోయినా టీవీ చూస్తూ కూర్చుండేదీ. అతనికి పనికెళ్ళినప్పుడు ఇండియాలో ఉన్నట్లే ఉండేదట. ఆఫీసులో చాలామంది ఇండియా వాళ్ళేనట. అందులో సగం మంది తెలుగువాళ్ళట. ఎప్పుడన్నా ఆఫీసు స్నేహితులు భోజనానికి పిలిచేవాళ్ళు. వాళ్ళను వీళ్ళు తిరిగి పిలిచేవాళ్ళు.

శారద అమెరికాకొచ్చిన నెల రోజుల్లోనే మాధవరావుకి ఉద్యోగం పోయింది. అతనికి పిచ్చెక్కి



ఇదేం మనిషి. జైలు శాంతంగా ఉంటుందా? బహుశా అతను నిజంగా రాక్షసుడేనేమో?

లేకపోతే అతను పోయిన తరువాత జైలే నయం అనుకుంటుందా?

నట్లయింది. చాలా చోట్ల ఉద్యోగ ప్రయత్నాలు చేశాడు. తాను కూడా ఏదైనా చిన్న ఉద్యోగం చేస్తానంది శారద. కానీ, ఇంగ్లీష్ రాకపోవడం, కారు నడపడం చేతగాకపోవడం వల్ల తానేం చెయ్యలేకపోయింది.

దున్నపోతులా తిని కూర్చోకుండా ఏదైనా ఉద్యోగం చేస్తే ఏడాదికి ముప్ఫైవేలన్నా వచ్చేవని ఎత్తిపొడుస్తుండేవాడు మాధవరావు.

"మరి అన్నీ తెలిసుండికూడా నన్నెందుకు చేసుకున్నారు. ఇక్కడే బాగా సంపాయించే అమ్మాయిని చేసుకోకపోయారా" అని శారద అంటే-

"ఇక్కడి అమ్మాయిలు ఇష్టం వచ్చిన వాళ్ళందరితోనూ పడుకుంటారు. ఫ్రెష్‌గా ఉన్న అమ్మాయి కావాలని నిన్ను చేసుకున్నాను" అన్నాడు మాధవరావు.

అతనికి ఇష్టం వచ్చినప్పుడల్లా ఆమెని నెట్టడం, జుట్టు లాగడం ఆ రోజుల్లోనే మొదలైంది. ఎందుకలా చేస్తున్నారంటే, తమాషాకేలే అనేవాడు. నొప్పి పుడుతుందని చెప్పినా వినేవాడు కాదు. పగలేకాక రాత్రి పూట కూడా అతని ప్రవర్తన ఇబ్బంది పెట్టేది శారదకు. వీడియోలు తెచ్చి, వాటిల్లో ఆడవాళ్ళు చేసినట్లు శారదను చెయ్యమనేవాడు. అతను తృప్తిపడి నిద్రపోయింతరువాతనే ఆమెకు స్వేచ్ఛ. మళ్ళా ఉదయమే మొదలయ్యేది బానిసత్వం.

అదృష్టవశాత్తూ తొందరలోనే అతనికి మళ్ళా ఉద్యోగం దొరికింది. కానీ, ప్రవర్తన మాత్రం మారలేదు. అతను ఆఫీసులో ఉన్నంతసేపూ మాత్రం ఇంట్లో భయం లేకుండా ఉండేది శారదకు.

ఆర్నెల్లక్రితం ఈ బాధలన్నీ తొలిగిపోయే అవకాశం దొరికిందామెకు. తల్లికి బాగా లేదని, చూడాలని అంటుందనీ టెలిగ్రామ్ వచ్చింది శారదకు. పోయి రమ్మన్నాడు మాధవరావు. తిరిగి రాకూడదనే ఉద్దేశంతోనే ఇండియా వెళ్ళింది శారద.

తల్లి సుభద్రమ్మకు చాలా కాలంగా రక్తపోటు జబ్బు. అప్పుడప్పుడూ ఆరోగ్యం బాగా క్షీణించి చచ్చిపోతుందేమోననుకున్నారు.

ఇప్పుడు కూడా అలాగే అయి ఉంటుందనీ, తల్లికి బాగాలేకపోవడం తనకు ఈ నరకం నుంచి బయటపడే అవకాశం కల్పించినందుకు సంతోషిస్తూ ఇండియా వెళ్ళింది శారద.

కానీ, ఆమె ఇంటికి చేరేసరికే సుభద్రమ్మ పోయింది. దాంతో శారదకు మనసు విప్పి మాట్లాడుకునే వాళ్ళెవరూ లేకుండా పోయారు. తండ్రికి మరో దిక్కు లేకపోవడం వల్ల అక్కడే ఉండిపోదామనుకుంది శారద. కానీ, ఆయన సమ్మతించలేదు. తన కోసం కూతురి జీవితం చెడడం ఆయనకిష్టం లేదు. పోనీ నిజం చెబితే? తిరిగి అమెరికా పోయే ఆలోచన లేదని చెబితే? సుభద్రమ్మ పోయిన దిగులుతో అసలే చితికిపోయిన ఆయన్ను ఇంకా బాధ పెట్టలేక, తన జీవితం గురించి ఆయనకు చెప్పలేకపోయింది.

ఇక ఈ జీవితం ఇలాగే సాగిపోవాలి కాబోలు అనుకుంటూ తిరిగొచ్చింది శారద.

అర్థం లేని జీవితం. భయం నిండిన జీవితం. బానిస జీవితం. ఎందుకూ ఈ జీవితం?

ఇండియా నుంచి తిరిగొచ్చిన శారదకు మాధవరావు ప్రవర్తనలో ఏమీ మార్పు కనిపించలేదు. తిట్టడాలూ, కొట్టడాలూ మామూలే. అన్నీ భరిస్తూ వచ్చింది. మరేం చేస్తుంది? ఆ రోజు మాత్రం... తనకు తెలియకుండానే ఏదో గట్టు తెగిన చెరువులా ఉద్రేకం పెల్లుబికింది.

తల వంచుకుని కథంతా చెప్పింతరువాత తలెత్తి నా వైపు చూసి నవ్వింది శారద. ఆమె నవ్వులో బాధ లేదు. సంతోషం లేదు. దిగుల్లేదు. శాంతం, నిర్మలత్వం. అంతే.

అప్పటికే చాలా ఆలస్యం అయింది. మళ్ళీ వస్తానని చెప్పి లేచాను.

"మీకు చదువుకోవడానికేమైనా కావాలంటే తెచ్చి పెడతాను" అన్నాను.

"జైలు జీవితం మీద ఏమైనా పుస్తకాలుంటాయా" అనడిగింది శారద.

"ఏమో? మీరే రాయాలి అలాంటి పుస్తకమొకటి" అన్నాను.

నిండుగా నవ్విందామె.

(ముక్కూ ముఖం తెలియనివారికి కూతుళ్ళనిచ్చి పెళ్ళిళ్ళు చేసి, అమెరికా పంపించి చేతులు కడుక్కొనే తల్లితండ్రులకు అంకితం)